పోషకాహారంపై నర్సింగ్ విద్యార్థుల ప్రదర్శన

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఆరోగ్యవంతమైన జీవితానికి ప్రతి ఒక్కరికి పోషకాహారంపై అవగాహన అవసరమని ప్రత్తిపాడు ప్రభుత్వ నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ ఎస్ఎస్ఆర్ మూర్తి సూచించారు. కళాశాల ఆవరణలో విద్యార్థులు స్వయంగా తయారుచేసిన పోషకాహారాన్ని ఆయన పరిశీలించారు. తక్కువ ఖర్చుతో దొరికే పోషకాహారాలను తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్వేతప్రభ, విసాలాక్షి, అరుణ్, నీరీషా, విశ్రాంత ఆరోగ్య పర్యవేక్షకులు బి కామేశ్వరరావు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

పోషకాహార స్టాల్స్‌లో నర్సింగ్ విద్యార్థులు

అసైన్డ్ భూముల్లో అక్రమ తవ్వకాలు

గండేపల్లి, పెద్దాపురంలో భారీగా గ్రావెల్ తరలింపు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

పేద దళిత రైతులకు చెందిన 570 ఎకరాల అసైన్డ్ భూముల్లో కొంతకాలంగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నా అధికారులు పట్టనట్లే వ్యవహరిస్తున్నారు. కొందరు అధికార పార్టీ నేతల అండదండలతో అక్రమార్కులు ప్రధానంగా గండేపల్లి మండలం రామేశ్వరంపేటలో భారీగా మట్టి రవాణా సాగిస్తున్నారు. సూరంపాలెం, పెద్దాపురం మండలం వాలుతిమ్మాపురం, కొండపల్లి, ఆనూరులలో భారీగా గ్రావెల్ తవ్వుకుని పోతున్నారు. ఎటువంటి అనుమతులు పొందకుండానే రూ.కోట్ల విలువ చేసే మట్టిని తరలిస్తున్నారు. గండేపల్లి మండలం రామేశ్వ రంపేట మెట్ట భూములను కొన్నేళ్ల క్రితం ప్రభుత్వం దళిత రైతులకు అసైన్డ్ చేసింది. ఆ భూములే కొందరు అక్రమార్కు లకు బంగారు కొండలా మారింది. వాటిపై కన్నేసిన కొందరు నామమాత్రంగా కొంత మొత్తంలో దళితు లకు ముట్టజెప్పి, కొందరిని బెదిరించి బడా మట్టి వ్యాపారులు రూ.కోట్లలో అంతు లేని సంపాదనను కూడగట్టుకొన్నారు. ఒకప్పుడు పచ్చగా కళకళలా డుతూ సుమారు 60 అడుగుల ఎత్తు ఉండే ఈ కొండ అంతా ఇప్పుడు కరిగి పోయింది. గత టిడిపి ప్రభుత్వ పాలనలో 2017 నుంచీ తవ్వకాలు జరుగుతున్నాయి. అప్పట్లో పెద్దాపురం నియోజకవర్గానికి చెందిన మాజీ మంత్రి అండదండలతో, ప్రస్తుతం ముఖ్యమంత్రి జగన్‌కు అతి సన్నిహితుడైన ఒక ప్రజాప్రతినిధి అనుచరులు ఈ తవ్వకాలు సాగిస్తున్నారు.



అక్రమ తవ్వకాలకు ఆనవాలుగా మిగిలిన విద్యుత్ లైన్లు

పొక్లెయిన్‌తో గ్రావెల్ తవ్వి లారీలో తరలిస్తున్న గ్రావెల్

అనుమతులు కొంత.. తవ్వేది కొండంత

క్వారీలలో తవ్వకాలు జరపాలంటే కచ్చితంగా రెవెన్యూ శాఖ నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ జారీ చేయాలి. దాని ఆధారంగానే మైన్స్ అధికారులు నిర్దేశిత ప్రాంతాన్ని పరిశీలించి తవ్వకాలకు అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఆయా శాఖల అధికారుల అనుమ తులు ఏమి లేకుండానే రామేశ్వరంపేట మెట్టలో గత ఐదేళ్లుగా యథేచ్ఛగా గ్రావెల్ తరలిస్తు న్నారు. గత, ప్రస్తుత ప్రభుత్వాలు పేదల ఇంటి స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాల అభివృద్ధి పనులకు కొంతమేర అనుమ తులు ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. 2017 నుంచి ఇప్పటి వరకూ కేవలం 30 ఎకరాల పరిధిలో 20 ఎన్‌ఒసిలు ఇచ్చారని సమాచారం. అయితే ఇక్కడ మాత్రం అనేక ఎకరాల్లో రూ.కోట్ల విలువైన మట్టి తరలిపోయిందని స్థానికులు చెబుతున్నారు.

మైనింగ్‌పై అధికారుల వెనకడుగు

అక్రమ మైనింగ్ వ్యవహారంలో అధికారులు నామ మాత్రపు చర్యలతో సరిపెడుతున్నారని అభిప్రాయం వ్యక్తం అవుతోంది. మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖలు అప్పుడప్పుడూ మట్టి తరలిస్తున్న వాహనాలను పట్టుకున్నా రాజకీయ నాయకులు అడ్డు తగులు తున్నారు. ఒక పక్క అనుమతులు ఏమీ లేవని చెబుతున్నప్పటికీ తవ్వకాలను నిలుపుదల చేసేందుకు అధికారులు ఎవరూ సాహసించలేక పోతున్నారు. అక్రమ తరలింపుపై ప్రత్యేక నిఘా, చెక్ పోస్టులను ఏర్పాటు చేయాల్సి ఉన్నా పట్టించు కోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రామేశ్వరంపేటలో పదుల సంఖ్యలో క్వారీలు నడుస్తున్న నేపథ్యంలో గతంలో రెవెన్యూ అధికారులు అడ్డుకున్నా దందా ఆగలేదు. సర్వే నెంబర్ 226/1లో సుమారు 2 ఎకరాల్లో తవ్వకాలకు ఒక వ్యక్తి అనుమతికి మించి తవ్వకాలు జరపడంతో రూ.4.45 కోట్లు జరిమానా విధించినా అక్రమార్కులు పట్టించుకోలేదు. సూరం పాలెం మెట్టలో 217/1, 217/3 లలో సుమారు 7 ఎకరాల్లో అనుమతి పొందిన దానికంటే అదనంగా మట్టి తవ్వడంతో రూ.8.66 కోట్ల జరిమానా విధించారు. నేటికీ జరిమానా కట్టలేదు. ప్రస్తుతం పెద్దాపురం మండలం వాలుతిమ్మాపురం, కొండపల్లి, అనూరులలో భారీగా గ్రావెల్ తవ్వకాలు ఎటువంటి అనుమతులు లేకుండానే జరుగుతున్న అధికారులు చర్యలు లేవని విమర్శలు వినిపిస్తున్నాయి.

అదుపులో అతిసార

- ఆదివారం కొత్తగా ఓ కేసు నమోదు- వైద్య శిబిరంలో ఎంఎల్ఎ చినరాజప్ప పరిశీలన

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని చిన్న బ్రహ్మదేవంలో అతిసార అదుపులో ఉందని కాండ్రకోట పిహెచ్‌సి వైద్యాధికారిణి డాక్టర్ సిహెచ్ ధనలక్ష్మి తెలిపారు. ఆదివారం కొత్తగా అమ్మాజీ (30) పేరుతో కేసు నమోదు కాగా పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించామన్నారు. అమ్మాజీతో పాటు పెద్దాపురం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో ఐదుగురు మాత్రమే చికిత్స పొందుతున్నారన్నారు. ఈ నెల 15వ తేదీ నుండి ఇప్పటి వరకు చిన్న బ్రహ్మదేవంలో 27 మంది ఈ వ్యాధికి బారిన పడగా వారిలో ఐదుగురు మినహా మిగిలిన వారందరూ చికిత్స పొంది నయం కాగా ఇళ్లకు వెళ్లిపోయారు. గ్రామంలో మంచినీటి సరఫరా జరిపే బోర్లు అన్నీ పరిశుభ్రం చేయించామని, గ్రామమంతా పరిశుభ్రత పనులు నిర్వహిస్తున్నారన్నారు. గ్రామంలో వైద్యుల పర్యవేక్షణలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అందరూ గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ఎప్పటికప్పుడు ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్నారని డాక్టర్ ధనలక్ష్మి తెలిపారు. చిన్న బ్రహ్మదేవం గ్రామంలో అతిసార పూర్తిగా తగ్గేంతవరకు అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ఆదేశించారు. ఆదివారం ఆయన గ్రామంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని సందర్శించి డాక్టర్లు వైద్య సిబ్బందితో గ్రామంలో అతిసార పరిస్థితిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రజలు మాట్లాడుతూ తమ గ్రామంలో మంచి నీటి ట్యాంకుల పరిశుభ్రతపై అధికారులు శ్రద్ధ తీసుకోవడం లేదని ఎంఎల్ఎకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కొత్తెం వెంకట శ్రీనివాస్ రావు,ఆచంట రాజబాబు, మొయిళ్ల కృష్ణమూర్తి, ఎగ్గడ శ్రీనివాస్ , మన్యం ప్రసన్న, సానిపిని సురేష్, నూనె రామారావు, మన్యం దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ చినరాజప్ప

ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ప్రభుత్వ నిబంధనల మేరకు అనుమతి లేని రాంపుల నుంచి ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అటువంటి వాహనాలను నావలను సీజ్ చేస్తామని అడిషనల్ ఎస్పీ.పి. శ్రీనివాస్ హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా జే.పి. వెంచర్స్ మాత్రమే ఇసుక సరఫరా చేస్తుందని తెలిపారు. వైసిపి రాష్ట్ర నాయకులు చింతలపాటి శ్రీనివాసరాజుతో కలిసి గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న ఇసుక ర్యాంపులను ఆయన పరిశీలించారు. పుదుచ్చేరి యానం, కనకాలపేట ప్రాంతాల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఆంధ్ర ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని వచ్చిన ఫిర్యాదుపై కనకాలపేట ర్యాంపును ఆయన పరిశీలించారు. ముమ్మిడివరం నియోజకవర్గ నియోజకవర్గ వ్యాప్తంగా 12 ఇసుక ర్యాంపులకు అనుమతులు రాగా తాళ్లరేవులో గోవలంక, పిల్లంక, తాళ్లరేవు, సీతారాంపురం రాంపులకు అనుమతులు వచ్చాయి. ఈ రాంపుల్లో ప్రభుత్వ ధరలకు ఇసుక అమ్మకాలు ప్రారంభించారు. ప్రభుత్వం అనుమతులు పొందిన సంస్థలు తప్ప మరొకరు అక్రమ ఇసుక గోదావరి నుంచి తీసిన, రవాణా చేసిన కఠిన చర్యలు తీసు కుంటామని ఆయన అన్నారు. ఆయన వెంట కాకినాడ రూరల్ సీఐ శ్రీనివాస్, కోరింగ్ ఎస్ఐ పి.శ్రీనివాస్ కుమార్, సర్పంచ్ కోరుకొండ సింహాద్రమ్మ, మండల కో-ఆప్షన్ సభ్యులు కూరాటి శ్రీకృష్ణ తదితరులు ఉన్నారు.

ఇసుక ర్యాంపులను పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పి శ్రీనివాస్

ప్రతి ఏటా లక్షా 50 వేల ప్రమాదాలు

ప్రమాద బాధితుల కుటుంబ సభ్యులకు ఆర్థిక సహకారం అందిస్తున్న ఎస్‌పి రవీంద్రనాథ్ బాబు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

మనం చేసే మానవ తప్పిదాల కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయని, చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల, ట్రాఫిక్ రూల్స్, ఆర్‌టిఏ నిబంధనలను పాటించకపోవడం వల్లే ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా 1,50,000 రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఎస్‌పి రవీంద్రనాథ్ బాబు అన్నారు. ఆదివారం కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రపంచ రహదారి ప్రమాద బాధితులు గుర్తింపు దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా ప్రమాదవ జరిగిన బాధితుల కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి యోగక్షేమాలు, ఆర్థిక సహకారం అందించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు దగ్గరలో ఉన్న వారుగాని, మార్గం మధ్యలో ప్రయాణించిన వారు గాని తక్షణం ప్రథమ చికిత్స అందించి ప్రాణాలు కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ప్రమాదంలో ఉన్న వారిని రక్షించి వారి ప్రాణాలు కాపాడిన వారికి ప్రభుత్వం తగిన విధంగా అభినందిస్తుందన్నారు. నిబంధనలను పాటించకపోతే ఒకరు చేసిన తప్పిదాల వల్ల తప్పు చేయని మరొకరు బాధపడాల్సి ఉంటుందని, తల్లితండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇచ్చేటప్పుడు డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ ఇచ్చి జాగ్రత్తలు చెప్పాలన్నారు. మద్యం తాగి, జాగ్రత్తగా వాహనాలు నడపకూడదని, ప్రతి వాహనానికి విధిగా బీమా చేయించుకోవాలన్నారు. ఈ సందర్భంగా రహదారి భద్రతను పాటించి ప్రమాదాలు నియంత్రణకు సహకరించిన ఆటో, లారీ డ్రైవర్లను అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి పి.శ్రీనివాస్, కాకినాడ డి.ఎస్.పి పడాల మురళీకృష్ణారెడ్డి, పెద్దాపురం ఇన్చార్జి డిఎస్‌పి సుంకర మురళీమోహన్, ట్రాఫిక్ డి.ఎస్.పి ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

బహుమతులు అందజేస్తున్న ఆర్‌జెడి మధుసూదనరావు, చైర్మన్ పద్మ

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. జిల్లా గ్రంథాలయంలో సంస్థ చైర్మన్ దూలం పద్మ , సంస్థ కార్యదర్శి వివిఎల్ఎన్‌వి ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవంలో విద్యాశాఖ రీజనల్ డైరెక్టర్ కె.మధుసూదన రావు, పి ఆర్ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్ శాంతి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉప గ్రంథాలయ అధికారి ఆర్ వెంకట రాము తదితరులు పాల్గొన్నారు. కాకినాడ గాంధీనగర్ శాఖ జిల్లా గ్రంథాలయంలో లైబ్రేరియన్ మలంపాక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థు లకు నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు డివైఓ రాజు బహుమతులు అందజేశారు. కాకినాడ రామకృష్ణారావు పేట గ్రంథాలయంలో లైబ్రేరియన్ కే రమేష్‌బాబు ఆధ్వర్యంలో విజేతలకు బహుమతులు అందజేశారు. **పెద్దాపురం** శాఖా గ్రంథాలయంలో ఆదివారం సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ జోస్యుల కృష్ణబాబు అధ్యక్షతన జరిగిన ముగింపు సభలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ముఖ్య అతిథిగా ప్రసంగించారు. విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అధికారి పాలంకి నాగరాజు విజేతల వివరాలు తెలియజేశారు. సభలో మహారాణి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వీరయ్య చౌదరి, ఆర్‌డిఓ కార్యాలయం ఏవో సరస్వతి, పెద్దాపురం చరిత్ర పరిశోధకులు వంగల పూడి శివకష్ణ,రంది సత్యనారాయణ, కొరిపూరి రాజు, బుల్లయ్య పాల్గొన్నారు.

మురారిలో విద్యార్థులతో ఉపసర్పంచ్ జాస్తి వసంత్



భీమవరపుకోటలో బహుమతులను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

తునిలో బహుమతులను అందజేస్తున్న గ్రంథాలయ కార్యదర్శి ప్రసాద్

కరప మండలంలోని కరప, వేళంగి శాఖ గ్రంథాలయలలో నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. చదవడం మాకిష్టం కార్యక్రమంపై పాఠకులు, తల్లిదండ్రులు, విద్యార్థిని విద్యార్థులతో అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వేళంగిలో మెర్ల కృష్ణప్రసాద్ ఆల్ రౌండ్ మెరిట్ స్టూడెంట్స్ నలుగురికి రూ రూ.2000 చొప్పున బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయుడు దూడల ప్రసాద్ విజేతలకు షీల్డ్‌ను, కరప గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతి విజేతలు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్ర మంలో మెర్ల వీరయ్యచౌదరి, బొండా వెంకన్నరావు, చంద్రు వెంకట రావు, చక్కా నూకరాజు, ఉపాధ్యాయులు దూడల వీరేంద్ర, వేళంగి లైబ్రేరియన్ రంగయ్య, ఫణీంద్ర పాల్గొన్నారు. **ఏలేశ్వరం** మండలం ఏలేశ్వరం, లింగంపర్తి గ్రామాలలో నిర్వహించిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సభలో వారం రోజులుగా వివిధ అంశాలలో నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులను గ్రంథాలయ డైరెక్టర్ సుంకర రాంబాబు అందజేశారు. కార్యక్ర మంలో జడ్‌పి టిసి మాజీ సభ్యుడు శిడగం వెంకటేశ్వరరావు, మున్సిపల్ వైస్ ఛైర్ పర్సన్ శిడగం త్రివేణి, వార్డు కౌన్సిలర్‌లు మూది నారాయణస్వామి, సామంతుల సూర్యకుమార్, కోరాడ రామలక్ష్మి ప్రసాద్, జువ్విన వీర్రాజు, గ్రంథాలయ పాలకుడు కవికొండల సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **గండేపల్లి** మండలం మురారిలోని గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభకు మురారి ఉప సర్పంచ్ జాస్తి వసంత్ ముఖ్యఅతిథిగా హాజరయి మాట్లాడారు. ఆధునిక యుగంలో డిజిటల్ గ్రంథాలయాలు ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తప్పనిసరిగా ప్రతి ఒక్కరు ఉపయోగించుకొని మంచి జ్ఞానాన్ని పొందాలని వసంత్ పిలుపునిచ్చారు. అనంతరం పోటీల్లో 30 మంది విజేతలకు ఉప సర్పంచ్ వసంత్, సర్పంచ్ కుక్కల ఆనంద్‌బాబు జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. లైబ్రేరియన్ డి.శాంతి ప్రియ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్ర మంలో గారపాటి రాజేశ్వరరావు, చావా తమన్న సోదరి శివ తమన్నా చౌదరి పాఠశాల, సిబ్బంది, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు. **కోటనందూరు:** విద్యుత్ విద్యతోనే దేశ అభివృద్ధి సాధ్యమని భీమవరపుకోట గ్రామ సర్పంచ్ జగటాల వీరబాబు అన్నారు. ఆదివారం భీమవరపుకోట అంబేద్కర్ భవన్లో గ్రామ పెద్దల వీరబాబు, నెమ్మాది రామారావు, కొత్తపెల్లి మాణిక్యాలరావు, నాగులపల్లి అప్పారావు, వీర యువసేన సంఘ ప్రతినిధులు, గ్రామ యువతీ యువకుల సహకారంతో ఏర్పాటుచేసిన గ్రంథాలయం ప్రథమ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. దళిత వాడ విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా స్టడీ సెంటర్ ఏర్పాటు చేసి నవోదయ, సైనిక్ స్కూల్, ఐఐటిలో ప్రవేశాల కోసం ఉచిత శిక్షణ ఇస్తున్నారన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా అంబేద్కర్ జీవిత, స్వతంత్ర సమరయోధుల జీవిత చరిత్రల పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలో ఉత్తమ ప్రతిభ కన బరిచిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో దేందేటి పృథ్వీనాగ్, మండల కో-ఆప్షన్ సభ్యులు జిగితల కోట సత్తిబాబు పాల్గొన్నారు. **తుని** లోని శాంతినగర్ రాజాగ్రౌండ్ వద్ద శాఖా గ్రంథాలయంలో వారోత్స వాలు ఆదివారంతో ముగిశాయి. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దూలం పద్మ వెంకన్నబాబు, కార్యదర్శి వివిఎల్ ఎన్ఎస్‌వి.ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న సినీ డైరెక్టర్ కురసాల కృష్ణ

పోటీలతో విద్యార్థుల్లో ప్రతిభ వెలికతీత

- సినీ డైరెక్టర్ కురసాల కృష్ణ

- ముగిసిన క్రియ పండుగ

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

క్రియా సంస్థ నిర్వహించిన ఈ పోటీలు విద్యార్థులు ప్రతిభకు పునాదులని సినీ డైరెక్టర్ కురసాల కృష్ణ అన్నారు. రెండు రోజుల పాటు క్రియా సంస్థ నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు సభకు ముఖ్య అతిథిగా సినీ డైరెక్టర్ కురసాల కృష్ణ విజేతలకు బహుమతులు అందజేశారు. ఆదివారం రెండో రోజు జెఎన్‌టియు వేదికగా నిర్వహించిన క్రియా పోటీలు సుమారు 13 అంశాల్లో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు. సంప్రదాయం నత్యం, లఘు నాటికలు, సైన్స్ ప్రాజెక్టులు స్టిక్ భూతం, పర్యావరణాన్ని కాపాడు కుంటూ భూమిని కాపాడుకోవాలని విద్యార్థులు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు రెండో రోజు కూడా అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేపర్ డ్రెస్ వేషధారణలో చిన్నారి జి.రత్నహర్షిత ఆకట్టుకుంది. నిర్వాహకులు కాదా వెంకట రమణ మాట్లాడుతూ విద్యార్థులు ప్రదర్శిం చిన ప్రదర్శనలు చూసుకునేందుకు వారి చిత్రాలను ఎప్పటి కప్పుడు క్రియా సంస్థ ద్వారా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తామన్నారు. అనంతరం వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బ్రహుమతులను అందజేశారు.

పేపర్ డ్రెస్‌తో చిన్నారి రత్న హర్షిత

కార్టూ'నిజం'

ఉక్కు ఫ్యాక్టరీని కాపాడలేకపోతున్నారు..

కానీ.. ప్రతి దానికీ 'ఉక్కుపాదం'

అని... సవాలొకటి...!!!

ఉత్సాహంగా వన మహోత్సవాలు

మల్లేపల్లిలో వనసమారాధనలో 1983 టెన్త్ బ్యాచ్ ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి- రౌతులపూడి

మండలంలోని గిడజం గ్రామ సమీపంలో కాపు. ఒంటరి. బలిజ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా వన సమరాదన నిర్వహించారు ఈ సమారాధనలో 4 వేల మంది అన్నదాన స్వీకరించారు. ఈ సంద ర్భంగా పలువురు సర్పంచులు ఎంపీటీసీ సభ్యులను సన్మానించారు. అలాగే యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు తమ కుటుంబ సభ్యులతో హాజరై ఘనంగా వన సమారాధన నిర్వహించారు. **ఏలేశ్వరం :** ప్రత్తిపాడు నియోజకవర్గ జనసేన నాయకుడు మేడిశెట్టి బాబి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వన సమారాధానకు పీఏసీ సభ్యులు పంతం నానాజీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కష్ణవేణి, రాష్ట్ర కార్యదర్శి ప్రియా సౌజన్య, పిఠాపురం నాయకులు పిల్లా శ్రీధర్, రాజమండ్రి కార్పొరేషన్ నాయకుడు వై శ్రీనివాస్, అనపర్తి నాయకుడు రావాడ నాగు, నియోజక వర్గ నాయకులు, కార్యకర్తలు హజరయ్యారు. **గండేపల్లి** మండలం మల్లేపల్లిలో ఆదివారం దిడ్డి వీర వెంకట సత్యనారాయణ(పెద్ద శ్రీను) సతీమణి అలివేలు మంగతాయారు (అలివేలు)ల పామాయిల్ తోటలో 1983 వ సంవత్సరంలో పదవ తరగతి పూర్వ విద్యార్థులు కార్తీక వన సమారాధన నిర్వహించారు. చిన్ననాటి స్నేహితుల కార్తీక వన సమారాధన కార్యక్రమానికి హైదరాబాద్, విశాఖపట్నం, కాకినాడ, రాజమండ్రి పిఠాపురం, పత్తిపాడు, జగ్గంపేట, ఇంకా ఇతర గ్రామాల నుండి స్నేహితులు వచ్చి, ఎంతో ఆనందంగా ఆటపాటలతో డ్యాన్సులతో ఉల్లాసంగా ఉత్సాహంగా ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ నుంచి వచ్చిన కేశవరపు వెంకట శ్రీనివాసన్(కె.వి), విశాఖపట్నం నుండి వచ్చిన మల్లె మొగ్గలు జనార్ధన్, శర్మ లు మాట్లాడుతూ కరోనా మహమ్మారి వలన రెండు సంవత్సరాలు కలవలేకపోయామని, ఆ తర్వాత మల్లేపల్లిలో మిత్రుడు దిడ్డి పెద్దశ్రీను దంపతులు ఏర్పాటుచేసిన కార్తీక వన సమారాధనలో స్నేహిలందరితో కలవడం ఆనందదాయకంగా ఉందన్నారు. గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య విద్యాసంస్థలకు చెందిన అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది కార్తీక మాసం చివరి ఆదివారం సందర్భంగా వన సమారాధన కార్యక్రమంలో కుటుంబ సభ్యుల తో ఉత్సాహంగా జరుపుకున్నారు ఆదిత్య సిబ్బంది తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆటపాటలతో ప్రకతి ఒడిలో ఉల్లాసంగా గడిపారు.ఈ సందర్భంగా ఏటువంటి ఇబ్బంది పడకుండా ఆదిత్య యాజమాన్యం రవాణా, భోజన సదుపాయాలు కల్పించి సహరించిందని సిబ్బంది ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. **పెద్దాపురం** పట్టణంలో ఆదివారం పలుచోట్ల వనసమారాధనలు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కట్టమూరు రోడ్డు లోని నెక్కంటి పామ్ ఆయిల్ తోటలో, వడ్రంగి మేస్త్రీల వన సమారాధనలో, సూర్య బలిజ సంక్షేమ సంఘం వన సమారాధనలో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాలలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ చైర్మన్‌లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **సామర్లకోట రూరల్ :** స్థానిక పిఠాపురం తంబురాడ గొయ్యి సమీపంలో పైణ్ణి శ్రీనివాసరావు పొలాల వద్ద ఫ్రెండ్స్ వాకర్స్ క్లబ్ అసోసియేషన్ నిర్వాహకులు మద్దాల వెంకన్న భీపల్లి తామస్. విప్పర్తి కొండలరావు, గోలి సత్తిరాజు, ఆధ్వర్యంలో వాకర్స్ క్లబ్ సభ్యులు కార్తీక వన సమారాధన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఎండి సైపుల్లా, పి వేణుగోపాలరావు, సత్యనారాయణ, కొల్లి చైతన్య, దర్శిపాడు సతీష్, గుండు శంకరరావు, సల్లూరు కళ్యాణ్, ఆర్టిసి మురళి, సింగంపల్లి శ్రీనివాసరావు, బుల్లి రాజు, రాము, ఇరుసుమళ్ళ గోపాల్, రవి, లింగం శివ, బాడీ బిల్డింగ్ ప్రసాదు, కర్రీ పశువుల రావు, కౌన్సిలర్ నేతలు హరిబాబు, తాతపూడి శ్రీను, వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వనమహోత్సంలో సూరంపాలెం ఆదిత్య సిబ్బంది

వనమహోత్సంలో సామర్లకోట ఫ్రెండ్స్ వాకర్స్ క్లబ్ సభ్యులు

శిలాఫలకాన్నిఆవిష్కరిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా తదితరులు

విద్య, ఆరోగ్యానికి ప్రాధాన్యత : మంత్రి రాజా

ప్రజాశక్తి - కోటనందూరు

విద్యా, ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమని రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. పి.కొట్టంలో ఆదివారం ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు నేడు పథకంలో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చామని, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో లోవ దేవస్థానం బొంగు ఉమారావు, బొంగు గోపాలకృష్ణ, చింతకాయల చినబాబు, మండల వైస్ ఎంపీపీ బంటుపల్లి గంగాధర్, కోఆప్షన్ సభ్యులు జగటాల కోట సత్తిబాబు, గొర్ల రామచంద్రరావు, గొర్ల అచ్చి నాయుడు, జి. శివలక్ష్మి దొరబాబు పాల్గొన్నారు.

యాత్రికులతో కిక్కిరిసిన అన్నవరం సత్యదేవుని దేవాస్థానం

కిటకిటలాడిన రత్నగిరి

ప్రజాశక్తి - అన్నవరం

కార్తీక మాసం సందర్భంగా అన్నవరంలో రత్నగిరి యాత్రికులతో కిటకిటలాడింది. ఆదివారం ఒక్కరోజే సత్యదేవుడిని లక్షన్నర మందికి పైగా దర్శించుకున్నారు. రూ.1.50 కోట్ల ఆదాయం వచ్చిందని దేవస్థానం అధికారులు తెలిపారు. 13,500 వ్రతాలు జరిగినట్లు తెలిపారు. శనివారం నుంచే యాత్రికుల రద్దీ అనూహ్యంగా పెరుగుతూ వచ్చింది. ఆదివారం సాయంత్రం 7 గంటల వరకు ఈ రద్దీ కొనసాగింది. రద్దీకి తగ్గటుగా దేవస్థానం ఇఒ ఎన్‌విఎస్‌ఎన్.మూర్తి క్షేత్ర స్థాయిలో తిరుగుతూ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడంతో దర్శనం క్యూలైన్ల, వ్రత మండపాల వద్ద తొక్కిస లాట లేకుండా సజావుగా యాత్రికులు స్వామి వారిని దర్శించుకున్నారు. అధిక సంఖ్యలో యాత్రికులు వాహనాల్లో రావడంతో ట్రాఫిక్ అంతరాయం లేకుండా వాహనాలు సత్యగిరి కొండకు మళ్లించారు. యాత్రికులకు పులిహోర, దద్దోజనం అందించారు.

అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కెవిపిఎస్ నాయకులు

కెవిపిఎస్ మండల కన్వీనర్‌గా శ్రీనివాస్

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్లరేవు మండలం కెవిపిఎస్ మండల కన్వీనర్‌గా విప్పర్తి శ్రీనివాసు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం తాళ్లరేవు ప్రజా సంఘాల భవనంలో సంఘం మండల మహాసభ విప్పర్తి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మూడేళ్లుగా సంఘం చేపట్టిన కార్యక్రమాలను ఆయన వివరించారు. కెవిపిఎస్ జిల్లా నాయకులు కెఎస్.శ్రీనివాస్ మాట్లాడారు. దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతర పోరాటం చేయాలని కెవిపిఎస్ సంఘం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నూతన కన్వీనింగ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారునిగా కాశి రవీంద్ర, గౌరవాధ్యక్షులుగా వడ్డీ ఏడుకొండలు, కన్వీనర్‌గా విప్పర్తి శ్రీనివాస్, కో-కన్వీనర్లుగా ఎ.రమణ, పులపకూర గోపాలకృష్ణ, పలివెల రవి, మడికి మధు, మందపల్లి ప్రసాద్, కాశీ జానకిరామయ్య, పి.ప్రకృతికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈనెల 26 రాజ్యాంగ దినోత్సవాన్ని స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం వద్ద నిర్వహించాలని, ఈ నెల 28,29 తేదీల్లో కర్నూల్‌లో జరిగే కెవిపిఎస్ రాష్ట్ర మహా సభకు హాజరుకావాలని, డిసెంబరు 6వ తేదీన అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని, దళితుల స్మశాన వాటిక సమస్యలపై పనిచేయాలని తీర్మానం చేశారు.

పాడి రైతుల పాలిట అజోల్లా ఒక వరం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

పాడి రైతులు పాలిట అజోల్లా పశుగ్రాసం ఒక వరం లాంటిదని కమ్యూనిటీ నేచురల్ ఫామింగ్ అధికారి ఎం.మల్లేశ్వరి తెలిపారు. ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం రైతు దేవర రాధాకృష్ణ పశుక్షేత్రంలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పాడి రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అజోల్లను పశువులకు దాణగా వినియోగించడం వల్ల ఇరవై శాతం పాల ఉత్పత్తి పెరగడమే కాకుండా వెన్న శాతం బాగా పెరుగుతుందన్నారు. రైతులు తక్కువ ఖర్చుతో తమ ఇళ్ల వద్ద కానీ, పొలాల్లో గాని అజోల్ల పెంపకం చేపట్టవచ్చని అజొల్ల పెంపకం విధానాన్ని రైతులకు ప్రయోగాత్మకంగా వివరించారు. రిలయన్స్ ఫౌండేషన్ మేనేజర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులకు పశుపోషణ, వ్యవసాయ విధానాల్లో సూచనలు, సలహాలకు ఉచిత టోల్ ఫ్రీ నెంబర్ 1800-419-8800 కేటాయించామన్నారు. ఈ నెంబర్‌కు ఉదయం 9-30 గంటల నుండి సాయంత్రం 7-30 వరకు రైతులు ఫోన్ చేసి శాస్త్రవేత్తలు, అధికారులు పశువైద్యులు, ఇతర నిపుణుల సలహాలు సూచనలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో న్యాచురల్ ఫార్మింగ్ సిబ్బంది ఎస్. లక్ష్మణ్‌బాబు, సిబ్బంది రైతులు ఉన్నారు.

కరాటే శిక్షణతో స్వీయ రక్షణ

ప్రజాశక్తి - కాకినాడరూరల్

కరాటేలో శిక్షణ పొందడం వల్ల ఆరోగ్యంతో పాటు స్వీయ రక్షణ చేకూరుతుందని వాకర్స్ జిల్లా ఛైర్‌పర్సన్ అడబాల రత్నప్రసాద్ అన్నారు. స్థానిక బోట్ క్లబ్ ఉద్యానవనంలో ఇటీవల తణుకులో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను, ప్రోత్సహించిన పిల్లల తల్లి దండ్రులను, కరాటే శిక్షకులు సూర్యను అభినందించారు. సూర్య మాట్లాడుతూ తమ గోజూరియా కరాటే శిక్షణ సంస్థ ద్వారా జాతీయస్థాయిలో జరిగిన కరాటే పోటీలలో పాల్గొనగా 30 స్వర్ణ, 15 రజిత, ఐదు కాంస్య పతకాలు సాధించామన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ సంఘ కార్యదర్శి దాసరి శ్రీధర్, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి ప్రయాణం సురక్షితం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఆర్‌టిసిలో ప్రయాణం సుఖవంతమైన ప్రయాణమని ఏలేశ్వరం డిపో మేనేజర్ ఎన్.బాపిరాజు అన్నారు. ప్రయాణికుల సంతృప్తికర వారోత్సవాల్లో భాగంగా సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రయాణికులు వారం రోజుల్లో 8500954112 ఏ సమయంలోనైనా ఫోన్ చేసి సూచనలు సలహాలు ఫిర్యాదులు అందజేయాలని ఆయన కోరారు.

26న అంబేద్కరీయుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి -ఉప్పలగుప్తం

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నవంబర్ 26 న స్థానిక ఎర్ర వంతెన సమీపంలో ఏర్పాటు చేసిన అంబేద్కరీయుల ఆత్మీయ కలయికను జయప్రదం చేయాలని మాల మహానాడు కోరింది. ఎన్.కొత్తపల్లిలో ఆదివారం మాల మహానాడు మండల కన్వీనర్ కొంకి వెంకట బాబ్జి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సర్పంచ్ కుంచే చిట్టికుమారి, నాయకులు గెద్దాడ బుద్ధరాజ్, పాము సత్యనారాయణ, కుంచే చిన్ని, పొలమూరి ఆనంద్, గిడ్ల శ్యామ్, పెయ్యల కొండబాబు తదితరులు మాట్లాడారు. రాజ్యాంగ దినోత్సవం రోజున అంబేద్కర్ వాదులంతా ఒకచోట కలిసి తమ ఐక్యతను చాటుకునేందుకు ఏర్పాటు చేసుకున్న ఈ ఆత్మీయ కలయికకు తరలిరావాలని కోరారు.

వర్శిటీ అభివృద్ధికి మరింత కృషి

ప్రజాశక్తితో జెఎన్‌టియుకె వైస్ ఛాన్సలర్ ప్రసాదరాజు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కాకినాడ జవహర్ లాల్ సాంకేతిక విశ్వవిద్యాలయం(జెఎన్‌టియుకె) అభివృద్ధికి ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు, ఇక్కడి అధికారుల సహాయ సహకారాలతో మరింతగా కృషి చేస్తామని యూనివర్శిటీ వైస్ చాన్సలర్ జీవిఆర్ ప్రసాద్ రాజు అన్నారు.తాను వీసీగా బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తయ్యిందన్నారు. ఈ కాలంలో వర్శిటీలో అనేక మార్పులు తీసుకురాగలిగానని తెలిపారు. ఇంకా పలు అంశాలను ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

వర్శిటీలో ఈఏడాది ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టారు?

జెఎన్‌టియుకెలో రూ.11 కోట్లతో పీజీ బ్లాక్ నిర్మించాం. ఇటీవలే ఇది ప్రారంభమైంది. రూ. 21కోట్లతో రోడ్లు, డ్రెయినేజీ పనులు చేపట్టాం. కాకినాడ యూనివర్సిటీ క్యాంపస్‌లో సుమారు రూ.97కోట్లతో వివిధ రకాల అభివద్ధి పనులకు టెండర్లు పూర్తయ్యాయి. కొన్ని నిర్మాణాలు ప్రారం భానికి సిద్ధంగా ఉన్నాయి. నరసరావుపేట కళాశాలలో దాదాపు రూ.110 కోట్లతో చేపట్టిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

ఏడాదిలో యూనివర్శిటీలో ఎలాంటి మార్పులు తీసుకొచ్చారు?

ఈ ఏడాదిలో పరీక్షల నిర్వహణలో భారీగా మార్పులు తీసుకొచ్చాం. వర్శిటీ అధికారుల సహాయంతో మూల్యాంకనం, ర్యాటిఫికేషన్ లాంటి ముఖ్య అంశాల్లో గణనీయమార్పులు తీసుకొచ్చాం. వర్శిటీ పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేటు ఇంజినీరింగ్ విద్యావిధానంలో ఈ మార్పుల తీసుకొచ్చాం. పలు అభివద్ధి పనులకు సంబంధించిన వాటిల్లో మార్పులు తీసుకొచ్చాం. యూనివర్శిటీ ఏర్పడిన 14 సంవత్సరాల తర్వాత తొలిసారిగా ఈ ఏడాది ర్యాటిఫికేషన్ విధానాన్ని తీసుకొచ్చాం. డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ అడిట్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోర్టల్ రూపొందించాం. నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా నియామకాలున్నాయా లేదా అనే అంశంపై దృష్టి సారించాం.

బోధనా రంగంపై ఎటువంటి దృష్టి సారించారు.?

యూనివర్శిటీలో 140 మంది ప్రొఫెసర్లు, 350 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 3,160 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను అర్హులుగా నిర్ధారించాం. వీరి ప్రభావం బోధనపై విశేషంగా ఉంటుంది. అందుకే బోధనారంగంపై ప్రత్యేక దృష్టి పెట్టాం. అసిస్టెంట్ ప్రొఫెసర్ల విషయంలో ఎలాంటి ప్రలోభాలకు తలొగ్గకుండా ర్యాటిఫికేషన్ చేశాం. అనుబంధ కళాశాలల నుంచి దీర్ఘకాలికంగా పెండింగ్ ఉన్న అఫిలియేషన్ ఫీజు బకాయి వసూలు చేయడంలో సఫలీకతమయ్యాం. బకాయి చెల్లించిన కళాశాలలకే ఈ ఏడాది గుర్తింపు ఇచ్చాం.

పరీక్షల విభాగంలో నూతన మార్పులు ఏమైనా తీసుకొచ్చారా.?

పరీక్షల విభాగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయడంలో సఫలీకృమయ్యాం. పిహెచ్ స్కాలర్స్ కోసం కొత్తగా ట్రాకింగ్ సిస్టమ్ అమలు చేస్తున్నాం. అలాగే తత్కాల్ ఓడీలకు ఆన్‌లైన్ అప్లికేషన్లు విధానం ప్రవేశపెట్టాం. ముఖ్యంగా స్పాట్ వాల్యుయేషన్ మేనేజ్‌మెంట్ విధానాన్ని అమలు చేయిస్తున్నాం. భవిష్యత్‌లో విద్యార్థి జవాబు పత్రంలో సమస్య వస్తే ముల్యాంకనం చేసిన వారి వివరాలు పక్కాగా తెలుసుకోవచ్చు.

విదేశీ వర్శిటీలతో ఒప్పందాలు, అందించే విదేశీ కోర్సుల వివరాలు తెలియజేస్తారా...

స్వీడన్ యూనివర్సిటీతో చేసుకున్న ఒప్పందం మేరకు సిఎస్ఇ, ఇసిఇ కోర్సులు నిర్వహిస్తున్నాం. ఇటీవల రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల వీసీలతో కలిసి జర్మనీలో పర్యటించాం. ఈ సందర్భంగా కొన్ని కోర్సుల కోసం ఒప్పందం చేసుకున్నాం. అమెరికాలో నార్తర్ అయోవా యూనివర్శిటీతో ట్రిపుల్‌ఇ కోర్సుపై అవగాహనకు వచ్చాం. జాతీయ, అంతర్జాతీయ సదస్సులు, సమావేశాల్లో పాలు పంచుకున్నాం.

బాలల హక్కులను కాపాడాలి

ప్రజాశక్తి - కాకినాడరూరల్

కొందరు తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపకుండా పనుల్లోకి పంపి డబ్బు సంపాదిస్తూ వారి హక్కులను హరిస్తున్నారని ఇది నేరమని న్యాయవాది రవి శంకర్ పట్నాయక్ అన్నారు. బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా సర్పవరం జంక్షన్‌లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో న్యాయవాది రవిశంకర్ పట్నాయక్ మాట్లాడారు. పెద్దలకు కొన్ని హక్కులు ఉన్నట్లుగానే బాలలకు కూడా కొన్ని ప్రత్యేక హక్కులు ఉన్నాయని ఆయన తెలిపారు. వాటిని గుర్తించి, గౌరవించడం తల్లిదండ్రులు బాధ్యత అని అన్నారు. బాలలకు జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, అభివృద్ధి చెందే హక్కులు ఉన్నాయన్నారు. వారికి పరిశుభ్రమైన ఆహారం, నీరు, విద్యను పొందే హక్కు కూడా ఉందన్నారు. బాలలను డబ్బు సంపాదించే వనరులుగా చూడరాదని పట్నాయక్ తెలిపారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

చురుకుదనంతో వృద్ధాప్యం దూరం

ప్రజాశక్తి - కాకినాడరూరల్

మానవ జీవితంలో చివరి దశ వృద్ధాప్యమని, కానీ చురుకుదనంతో మసలితే శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారని డాక్టర్ కె.వెంకటరమణ వివరించారు. సర్పవరం జంక్షన్ లో బోటు క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేడు సగటు జీవిత కాలం పెరిగి 60 ఏళ్ళ పైబడిన వారు కూడా ఎంతో చురుకుగా ఉంటు న్నారని అన్నారు. రోజు వాకింగ్ చేస్తూ దిగులు, విచారం లేకుండా సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. శరీరంలో ఏ అవయవయాన్ని ఉపయోగించకపోయినా అది పనిచేయకుండా పోతుందన్నారు. ఒత్తిడి అనేది మెదడుకు సంబంధించిన శత్రువు కాబట్టి ఒత్తిడిని తగ్గించుకోవాలని అన్నారు. శాఖాహారం తీసుకుంటూ కుటుంబ సభ్యులతో, స్నేహితులతో చక్కగా మసలాలని అన్నారు. నేను వద్దుడిని అనే భావాన్ని విడనాడాలని వెంకట రమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, రేలంగి బాపిరాజు క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని జొన్నాడ కుంతీదేవి ఆలయ సమీపంలో ఆదివారం వేకువజామున జరిగిన అగ్ని ప్రమాదంలో మోరంపూడి సాయిబాబాకు చెందిన తాటాకిల్లు దగ్ధమైంది. సమాచారం అందుకున్న మండపేట అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరకున్నారు. ఫైర్‌ఆఫీసర్ జె.హనుమంతురావు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను ఆర్పేశారు. ఘటనా స్థలాన్ని విఆర్‌ఒ వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ నాంద్ర నాగమోహన్ రెడ్డి పరిశీలించారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 2 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితులు తెలిపారు. బాధితులకు తక్షణ సాయంగా నాంద్ర నాగమోహన్‌రెడ్డి రూ.5 వేలు, నిత్యావసర సరుకులను అందించారు. ఎస్‌సి కమ్యూనిటీ హాల్లో బాధిత కుటుంబానికి వసతి ఏర్పాటు చేవారు. ఈ కార్యక్రమంలో తాడి శ్యామ్ సుందర్ రెడ్డి, గొలుగూరి సత్తిరెడ్డి, కట్టా ప్రసాద్, నక్క రాజేష్, రొక్కల బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డున పడ్డ భవన నిర్మాణ కార్మికులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

పాలకుల విధానాల వల్ల కోట్లాది మంది భవన నిర్మాణ రంగ కార్మికులు రోడ్డున పడుతున్నారని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాలి రమణ అన్నారు. ఆదివారం రాజమహేంద్రవరంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 26 నుంచి 28 వరకు అఖిలభారత భవన నిర్మాణ కార్మిక సంఘం జాతీయ మహాసభలు రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు.దేశంలో వ్యవసాయం తర్వాత ఎక్కువ మంది భవన నిర్మాణ రంగంలోనే ఉన్నారన్నారు. నిర్మాణ రంగంలో దేశవ్యాప్తంగా 40 కోట్ల మంది వరకూ ఉపాధి పొందుతున్నారన్నారు. 1996లో కేంద్ర ప్రభుత్వం చేసిన చట్టాన్ని అమలు చేయడంలో చాలా రాష్ట్రాలు విఫలమవుతున్నాయన్నారు 2009లో కార్మికుల పోరాటం ఫలితంగా నాటి ముఖ్యమంత్రి వైఎస్ఆర్ చట్టాన్ని అమలు చేశారన్నారు. నేడు అదే చట్టాని జగన్‌సర్కారు నిర్వీర్యం చేయడం శోచనీయమన్నారు. ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ ఈనెల 26న మధ్యాహ్నం రెండు గంటలకు మున్సిపల్ స్టేడియం నుంచి కార్మికులతో కంబాల చెరువు వరకూ ప్రదర్శన జరుగుతుందన్నారు. అనంతరం కంబాల చెరువు సెంటర్‌వద్ద బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ సభకు యూనియన్ జాతీయ అధ్యక్షులు విజయన్ కురిసరి, ఎఐటియుసి జాతీయ కార్యదర్శి వహీదా ప్రవీణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఎఐటియుసి జిల్లా కన్వీనర్ కె.రాంబాబు, సిపిఐ నగర కార్యదర్శి వి.కొండలరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ ఉమర్ వలీ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నాలం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

29న జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - అమలాపురం

రాజానగరం మండలం కొండగుంటూరు మాదిగపేటలో ఈనెల 29న భారత తొలి మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబుజగజ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణను నిర్వహిస్తున్నట్టు ఎంఎస్‌పి జిల్లా కన్వీనర్ యార్లగడ్డ సత్తిబాబు తెలిపారు. ఆదివారం అమలాపురం స్థానిక గడియార స్తంభం సెంటర్లో నియోజకవర్గ ఎంఎస్‌పి కన్వీనర్ లూటుకుర్తి చిన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. విగ్రహావిష్కరణకు సంబంధించిన కరపత్రాన్ని ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి వ్యవస్థాపక అధ్యక్షులు మంద కష్ణ ఈ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారన్నారు. అనంతరం సభ జరుగుతుందన్నారు. కోనసీమ జిల్లాలో ఉన్న ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పి జిల్లా అధికార ప్రతినిధి నూటుకుర్తి సత్యనారాయణ, సవరపు అబ్రహం, లంక రామకృష్ణ, నేదునూరి వెంకట్రావు, చెట్ల రామారావు, సవరపు శ్రీను, ఖండవల్లి ఏలియా, సిహెచ్.బద్రి తదితరులు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సుకు సహకార సంఘాల కృషి

ప్రజాశక్తి - కాట్రేనికోన

రైతుల శ్రేయస్సు కోసం సహకార సంఘాలు నిరంతరాయంగా కషి చేస్తున్నామని కోనసీమ జిల్లా సహకార అధికారి రాధాకష్ణారావు అన్నారు. ఆదివారం కాట్రేనికోనలో జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డిసిసిబి) బ్రాంచి వద్ద నిర్వహించిన 69వ అఖిల భారత సహకార సంఘాల వారోత్సవాల ముగింపు సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సహకార బ్యాంకులు వాణిజ్య బ్యాంకులకు ధీటుగా అన్ని రకాలైన సేవలు అందిస్తున్నాయని వాటిని ఖతాదారులు, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన డిసిసిబి జనరల్ మేనేజర్ పి.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం సొసైటీల ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను వివరించారు. సభ్యులు స్వల్ప, దీర్ఘకాలిక రుణాలను తీసుకొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు అన్ని విధాల అండగా నిలుస్తూ, వారి ఆర్థిక అభివద్ధికి తోడ్పాటు అందించడమే సహకార సంఘాల ముఖ్య ఉద్దేశమని జిల్లా సహకార విద్యా అధికారి ఆదిమూలం వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాట్రేనికోన జడ్‌పిటిసి సభ్యులు నేల కిషోర్‌కుమార్, సర్పంచ్ గంటి వెంకట సుధాకర్, సొసైటీ అధ్యక్షులు మంతెన మమ్మురాజు, జగడం బాలయోగి, ఏడిది సుబ్బారావు, సలాది తులసీరావు, వనచర్ల సత్యంశెట్టి, అక్కల శివ రామకష్ణ, మండల వైకాపా కన్వీనర్ నల్లా నరసింహమూర్తి, మేనేజర్ జి.బి.మనోహర్, సహకార సంఘాల సిఇఒలు తదితరులు పాల్గొన్నారు.

జోడో యాత్రకు అనూహ్య స్పందన

ప్రజాశక్తి -మండపేట

ఇటీవల రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు చేపట్టిన భారత్ జోడో యాత్రకు అనూహ్య స్పందన లభిస్తుందని ఏఐసిసి కార్యదర్శి గిడుగు రుద్రరాజు అన్నారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎఐసిసి సభ్యులు కామన ప్రభాకరరావుతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించడంలో వైసిపి ప్రభుత్వం విఫలమైందన్నారు. ధాన్యం కొనుగోలు అస్తవ్యస్తంగా ఉండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జోడో యాత్రకు అడుగడుగునా మహిళలు, యువకులు స్వచ్ఛందంగా తరలివచ్చి రాహుల్ కు మద్దతు తెలుపుతు న్నారన్నారు.

కుంగ్ ఫూ అభివృద్ధికి సహకారం

ప్రజాశక్తి -మండపేట

అంతరించిపోతున్న కుంగ్ ఫూ అభివృద్ధికి సహకారం అందిస్తానని మున్సిపల్ మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ అన్నారు. ఆదివారం మండపేటలో కుంగ్‌ఫూ మాస్టర్ల సమ్మేళనానికి ప్రకాష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రాచీన కాలం నుంచి కుంగ్‌ఫూ కళకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. తన తండ్రి చుండ్రు గోవిందరాజు ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా ఉన్నారన్నారు. ఆయన ద్వారా కుంగ్‌ఫూను విస్తరించడానికి, ఆర్థికంగా వెనుకబడిన కుంగ్ ఫూ మాస్టర్లను వెన్ను తట్టి ప్రోత్సహించడానికి సహకరిస్తానని తెలిపారు. ఈ కళను నేర్చుకున్న వారికి ఉద్యోగావకాశాల్లో రెండు శాతం రిజర్వేషన్ ఉందన్నారు. ఈ సందర్భంగా ప్రకాష్ ను ఘనంగా సత్కరించారు. న్యూ డ్రాగన్ చైనీస్ కుంగ్ ఫూ గ్రాండ్ మాస్టర్ పిట్టా రాజబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పి.సాంబశివరెడ్డి, పి.రాజబాబు, టి.అబ్బులు పాల్గొన్నారు.

భీమారావుకు గుడ్‌సీడ్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

రెండు కిడ్నీలు పాడై అనారోగ్యంతో బాధపడుతున్న చల్లపల్లి పంచాయతీ అంబేద్కర్ నగర్‌కు చెందిన కొల్లు భీమారావుకు గుడ్ సీడ్ ఫౌండేషన్ ఆర్థిక సాయం అందించింది. గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్,వైసిపి యువజన నాయకుడు కుంచే రమణారావు ఆదివారం భీమారావు ఇంటికి వెళ్లి అతనికి రూ. 20 వేల సాయం అందించారు. రమణారావుకు బాధిత కుటుంబం, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొల్లు దేవేంద్రుడు, పరమట సత్యనారాయణ, రాజేష్, ఏడుకొండలు, కాట్రు మధు, పాము నాగేశ్వరరావు, కుసుమ ఆనంద్, నేరేడుమిల్లి శ్రీను, బుడితి హేమంత్ నాగేంద్ర,రవితేజ, సింహాద్రి పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE II ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT ANAKAPALLE
I.A.No.122/2021 in O.S.No.541/2006
Between:
Ayyalasomayajula Lakshmi Narasamma & Another ...Petitioners / Plaintiffs
And:
Smt. Padmasolala Veerabhadramma & Others ...Respondents / Defendants
To,
Respondents No.5 :
5. Padmasolala Kiran Kumar
S/o. Agnihotra Gowripathi Sastry, Hindu, aged 36 years, D.No. 1-37, C/o. Milk Booth, Venkata Krishnapuram Village, Samaralkota Mandal, East Goadvari District.
నోటీసు
పై నెంబరు I.A.122/2021ను 6వ వాది చనిపోయినందున ఆయన తాలుకా వారసులను చేర్చడంలో 85 రోజులు ఆలస్యం అయినందున సదరు ఆలస్యంను శ్రీకోర్టు వారు Condone చేయించవలసిందిగా పై నెంబరు I.A.ను పిటీషనర్లు, రెస్పాండెంట్లు పై దాఖలు చేసియుంటిరి. కాగా పై నెంబరులో 5 రెస్పాండెంటు అయిన మీకు నోటీసు నిమిత్తం **తేది:06-12-2022కి** వాయిదా అయివున్నది. కావున మీరు సదరు తేదీన మీరు గాని మీ వకీలుగారి ద్వారా గాని పై కోర్టులో **ఉదయం గం. 10-30 ని॥లకు** హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్నచో తెలియ పరచుకోవలెను. లేనిచో మీ పరోక్షమందు తీర్మానించడమగునని ఇందుమూలంగా తెలియపరచడమైనది.
లంక జగన్నాధం
లంక పార్వతీశ్వర్
అడ్వకేట్లు, అనకాపల్లి.

IN THE HONOURABLE COURT OF THE II ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT ANAKAPALLE
I.A.No.124/2021 in O.S.No.541/2006
Between:
Ayyalasomayajula Lakshmi Narasamma & Another ...Petitioners / Plaintiffs
And:
Smt. Padmasolala Veerabhadramma & Others ...Respondents / Defendants
To,
Respondents No.5 :
5. Padmasolala Kiran Kumar
S/o. Agnihotra Gowripathi Sastry, Hindu, aged 36 years, D.No. 1-37, C/o. Milk Booth, Venkata Krishnapuram Village, Samaralkota Mandal, East Goadvari District.
నోటీసు
పై నెంబరు I.A.124/2021ను 6వ వాది చనిపోయినందున ఆయన తాలుకా వారసులను చేర్చమని పై నెంబరు I.A.ను పిటీషనర్లు, రెస్పాండెంట్లు పై దాఖలు చేసియుంటిరి. కాగా పై నెంబరులో 5 రెస్పాండెంటు అయిన మీకు నోటీసు నిమిత్తం **తేది:06-12-2022కి** వాయిదా అయివున్నది. కావున మీరు సదరు తేదీన మీరు గాని మీ వకీలుగారి ద్వారా గాని పై కోర్టులో **ఉదయం గం. 10-30 ని॥లకు** హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్నచో తెలియ పరచుకోవలెను. లేనిచో మీ పరోక్షమందు తీర్మానించడమగునని ఇందుమూలంగా తెలియపరచడమైనది.
లంక జగన్నాధం
లంక పార్వతీశ్వర్
అడ్వకేట్లు, అనకాపల్లి.

IN THE HONOURABLE COURT OF THE II ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT ANAKAPALLE
I.A.No.123/2021 in O.S.No.541/2006
Between:
Ayyalasomayajula Lakshmi Narasamma & Another ...Petitioners / Plaintiffs
And:
Smt. Padmasolala Veerabhadramma & Others ...Respondents / Defendants
To,
Respondents No.5 :
5. Padmasolala Kiran Kumar
S/o. Agnihotra Gowripathi Sastry, Hindu, aged 36 years, D.No. 1-37, C/o. Milk Booth, Venkata Krishnapuram Village, Samaralkota Mandal, East Goadvari District.
నోటీసు
పై నెంబరు I.A.123/2021ను 6వ వాది చనిపోయినందున ఆయన తాలుకా వారసులను చేర్చడంలో శ్రీ కోర్టు వారు abate చేసినందున సదరు abatement orderను రద్దు చేయించ వలసిందిగా పై నెంబరు ఐ.ఎ.ను పిటీషనర్లు, రెస్పాండెంట్లు పై దాఖలు చేసియుంటిరి. కాగా పై నెంబరులో 5వ రెస్పాండెంట్లు అయిన మీకు నోటీసు నిమిత్తం **తేది:06-12-2022కి** వాయిదా అయివున్నది. కావున మీరు సదరు తేదీన మీరు గాని మీ వకీలుగారి ద్వారా గాని పై కోర్టులో **ఉదయం గం. 10-30 ని॥లకు** హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్నచో తెలియ పరచుకోవలెను. లేనిచో మీ పరోక్షమందు తీర్మానించడమగునని ఇందుమూలంగా తెలియపరచడమైనది.
లంక జగన్నాధం
లంక పార్వతీశ్వర్
అడ్వకేట్లు, అనకాపల్లి.

నేరాలు ఘోరాలు

ఐరన్ కేబుల్ చోరీపై కేసు నమోదు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని బొబ్బర్లంకలో బ్యారేజి వద్ద ఐరన్ కేబుల్ చోరీకి గురైంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. రూ.20 వేలు విలువ చేసే ఐరన్ కేబుల్ కనిపించకపోవడంతో గోదావరి హెడ్ వర్క్ బ్యారేజీ నిర్వహణ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కందికట్ల నాగలక్ష్మి పోలీసులు ఫిర్యాదు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ సిహెచ్.సుధాకర్ తెలిపారు.

మహారాజశ్రీ ఫ్యామిలి జడ్జి వారి కోర్టులో :: ఒంగోలు
FCOP.NO.33/2022
బిట్వీన్
గొడుగు అనీల ....పిటిషనర్
మరియు
గొడుగు రాజ్‌కుమార్ ... రెస్పాండెంట్
To
గొడుగు రాజ్ కుమార్, తండ్రి లేటు విజయ్‌రాజు ఆర్.టి.సి డ్రైవరు, డోర్ నంబర్. 26-6-17, కంబాలపేట, రాజమండ్రి అర్బన్ మండలం తూర్పుగోదావరి జిల్లా.
పై నంబర్ పిటిషన్‌లో పిటీషనర్ గొడుగు అనీల మీ పై విడాకులు నిమిత్తం ఒంగోలు ఫ్యామిలి జడ్జి వారి కోర్టులో లో FCOP. 33/2022 నంబర్ గల కేసు కు దాఖలు చేయగా గొడుగు రాజ్ కుమార్ హాజరు నిమిత్తము కోర్టు వారి ద్వారా ఎన్ని సార్లు నోటీసులు పంపించినను సదరు గొడుగు రాజ్ కుమార్ ఉద్దేశపూర్వకముగా నోటీసులు తీసుకొని యుండలేదు. కావున మీకు తెలియజేయునది ఏమనగా పై పలకరించిన కేసు మీ హాజరు నిమిత్తము 30-11-2022 ను వాయిదా అయియున్నది. కావున ఆ రోజు ఉదయం 10.00 గంటలకు మీరు గాని మీ న్యాయవాది గాని ఫ్యామిలి కోర్టు నకు హాజరు అయి కేసు నడిపించుకోగలరు లేని యెడల కోర్టు వారు మీ పరోక్షమున కేసు విచారణ చేయగలరని ఇందు మూలముగా తెలియపరచ డమైనది.
// గౌరవ కోర్ట్ వారి ఉత్తర్వుల మేరకు //
ఒంగోలు
తేది: 20-11-2022 ఇట్లు
నాగిశెట్టి మోహన్ దాస్
షేక్ సకినా బాను
పిటిషనర్ తరపు న్యాయవాదులు,
ఒంగోలు,ప్రకాశం జిల్లా

మహారాజశ్రీ గౌరవనీయులైన జూనియర్ సివిల్ జడ్జి ప్రత్తిపాడు వారి కోర్టులో
I.A.No: 305/2021
O.S.No: 137/2021
బిట్వీన్:
హొతా సాయి గౌరీ కుమారం మరియు ఇతరులు ...పిటిషనర్స్ /వాదులు
మరియు
జుత్తుక వీరబాబు మరియు ఇతరులు ...రెస్పాండెంట్స్ /ప్రతివాదులు
బహిరంగ ప్రకటన
పైన పేర్కొన్న కేసులో రెస్పాండెంట్స్ /ప్రతివాదులు అయిన 1,3,4 లు అనగా జుత్తుక వీరబాబు, తండ్రి: సత్తిబాబు అనే సత్యనారాయణ, జుత్తుక సత్తిబాబు అనే సత్యనారాయణ, తండ్రి: సత్తియ్య, జుత్తుక సత్యవతి, భర్త: సత్తిబాబు అనే సత్యనారాయణ, అందరిదీ డోర్ నెంబర్: 2-72, సిరిపురం గ్రామం ఏలేశ్వరం మండలం, లకు కోర్టు వారి నుండి ఎన్నిసార్లు నోటీసులు, సమన్లు పంపినా తీసుకొనకుండా కాలయాపన చేస్తున్నారు. కావున శ్రీ కోర్టు వారి ఆర్డర్ పై రెస్పాండెంట్స్ /ప్రతివాదులు అయిన 1,3,4 ల హాజరుకై **ది.16-12-2022న పై కేసు, పై కోర్టులో వాయిదాకు ఉన్నది.** ఆ రోజు ఉదయం 10:30 గంటలకు ప్రతివాదులు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా కానీ హాజరై ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేనియెడల పరోక్షమున తీర్మానించబడునని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.
బుగత వెంకట శివన్నారాయణ,
న్యాయవాది, ప్రత్తిపాడు.
సెల్: 98490 64436

మహారాజశ్రీ పెద్దాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.P:7/2021
బిట్వీన్:
దొంతంశెట్టి సుబ్రమణ్యం అనే నంది ...పిటీషనరు
మరియు
మాధురి టెక్స్ టైల్స్ & వగైరా ...రెస్పాండెంట్లు
నోటీసు
To:
R-6: ఎస్.ఎం.ఎస్ గ్రూప్ సారీస్, డి 44/ 84221010, లూక్స రోడ్, వారణాసి, ఉత్తరప్రదేశ్.
R-41: మా భక్తి టెక్స్ టైల్స్, డో.నెం:356, మిల్లీనియం మార్కెట్-2, రింగ్ రోడ్, సూరత్-395002, సెల్: 9727918016.
R-49: నటాషా ఎన్.ఎక్స్. డో.నెం:జె-3561, మిల్లీనియం మార్కెట్, రింగ్ రోడ్, సూరత్-395002, సెల్:9426479158.
R-50: హెచ్.ఎమ్.అస్లామ్ & సన్స్, డో.నెం:44/28, రియోరి తలాబ్ రోడ్, వారణాసి-221010, సెల్: 9935940970.
R-51: కాశీ వస్త్రాలయం, డో.నెం:42/53, అల్లుకి మసీద్ వద్ద, మాదాపూర్, వారణాసి-221001. సెల్: 7408317699.
R-51: హమీద శారిస్, డో.నెం:43/136A, R-1, బజార్ సదానాదా, మాదాపూర్, వారణాసి-221001, సెల్: 7844851427.
పై నెంబర్ I.P. లో పిటిషనర్ పిటిషన్ దాఖలు చేసుకుని యున్నందున సదరు I.P. లో రెస్పాండెంట్స్ అయిన మీకు ఏమైనా ఏ విధమైన ఆక్షేపణలు మరియు లావాదేవీలు, బాకీలు గాని ఉన్న యెడల పై కోర్టు వారి ఎదుట **ది.25-11-2022వ తేదీన ఉదయం గం॥ 10:30 నిముషాలకు మీరు హాజరు అయి మీకు ఏమైనా ఆక్షేపనలు ఉన్న యడల మీరు స్వయంగా గాని వకీల్ ద్వారా గాని హాజరై తెలియపరచుకోవలెను.** లేనిచో మీకు పరోక్షముగా తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.
బుగత వెంకట శివన్నారాయణ,
అడ్వకేట్, ప్రత్తిపాడు.
సెల్: 9849064436